ప్రమాదపుటంచుల్లో పాదచారి!

ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంలో తీవ్ర జాప్యం

- ప్రతిపాదనల దశ దాటని వైనం
- ప్రమాదాల బారిన పాదచారులు
- రోడ్డు దాటాలంటే భయపడుతున్న ప్రజానీకం
- అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాదచారుల రక్షణకు చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పలు ప్రాంతాల్లో రహదారులు దాటేయత్నంలో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆయా ప్రమాదాలు రోజురోజుకూ అధికం అవుతున్నా అధికారుల్లో స్పందన లేకపోవడం గమనార్హం. రోడ్లు దాటేందుకు ప్రతిపాదించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రమాదాలు నిత్యకృత్యం అవుతున్నాయి.

- గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రధాన జాతీయ రహదారి హైదరాబాద్–బీజాపూర్ రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్ సమస్యలు సైతం అధికంగా ఉంటాయి. రోడ్డు దాటే సమయంలో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని అరికట్టేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ట్రాఫిక్‌లో రోడ్డు దాటుతున్న విద్యార్థులు

బిక్కుబిక్కు మంటూ రోడ్డు దాటుతూ...

రోజూ ఉదయం వేళల్లో స్కూళ్లు, కాలేజీలు, ఉద్యోగాలకు వెళ్లే జనాలు రోడ్లపై ఏర్పడిన ట్రాఫిక్ సమస్యతో రోడ్డు దాటే సమయంలో నానా అవస్థలు పడుతున్నారు. బిక్కుబిక్కు మంటూ రోడ్డు దాటే పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేదు.

కాళీమందిర్ ప్రాంతంలో...

కాళీమందిర్‌కు అమ్మవారి దర్శనం నిమిత్తం నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. దేవాలయ ప్రాంతంలో పాదచారుల సౌకర్యార్థం రోడ్డు దాటేందుకు ట్రాఫిక్ అధికారులు గతంలో ప్రత్యేక సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అది ప్రస్తుతం పని చేయకపోవడంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

జనాభా అవసరాలకు అనుగుణంగా...

బండ్లగూడ జాగీర్ సిటీలో అంతర్ భాగంగా ఉండి కార్పొరేషన్‌గా మారింది. ఈ ప్రాంతంలో గృహ సముదాయాలు, పెద్ద పెద్ద విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లు భారీగా వెలిశాయి. మరిన్ని వచ్చే అవకాశం కూడా లేకపోలేదు. శరవేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ, ట్రాఫిక్ వసతులను మెరుగుపర్చడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రతిపాదించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బిక్కుబిక్కు మంటూ పిల్లాడితో రోడ్డు దాటుతున్న మహిళ

ప్రణాళికలు సిద్ధం చేసినా...

గతంలో అధికారులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినా అవి కార్యరూపం దాల్చలేదు. అప్పటి సైబరాబాద్ సీపీ సి.వి.సజ్జనార్ పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి యత్నించారు. మున్సిపల్ అధికారులతో కలిసి టిప్పుఖాన్ పూల్ బ్రిడ్జి నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు స్వయంగా పరిశీలించారు. కాళీమందిర్, అంబేడ్కర్ చౌరస్తా, హైదర్షాకోట్ సన్‌సిటీ ప్రాంతాల్లో మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ఆ ప్రతిపాదనలు కాస్తా అటకెక్కడంతో పాదచారుల ఇబ్బందులు మరింత పెరిగాయి. అదే స్థాయిలో ప్రమాదాలూ జరుగుతున్నాయి.

ఆర్‌అండ్‌బీకి ప్రతిపాదనలు

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపాము. టిప్పుఖాన్‌పూల్ బ్రిడ్జి నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు మీడియన్‌ను మూడు ఫీట్ల మేర ఎత్తు చేస్తాం. యూటర్న్ ఉన్న దగ్గర పెలికాన్ సిగ్నల్స్ పెట్టి పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేస్తాం. ఆ ప్రాంతంలో రోడ్డు దాటేలా రోడ్ల భవనాల శాఖకు ప్రతిపాదనలు సమర్పించాం.

– నిరంజన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, నార్సింగి

బ్రిడ్జిలను నిర్మిస్తాం



గతంలో కౌన్సిల్ సమావేశంలో కూడా ప్రతిపాదనలు పెట్టాం. అవి అమలు కాలేదు. పాదచారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోడ్డు దాటేందుకు ఇబ్బందులు నెలకొనే ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రతిపాదించాం. ఆదిశగా చర్యలు చేపట్టి ప్రణాళికలు సిద్ధం చేస్తాం. త్వరలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తాం.

– శరత్‌చంద్ర, కమిషనర్, బండ్లగూడ జాగీర్

అభివృద్ధి పనులు చేపట్టాలని జెడ్‌సీకి వినతి



జెడ్‌సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించి తద్వారా ఇబ్బందుల తలెత్తకుండా చేసే నిమిత్తం పలు ప్రాంతాల్లో సత్వరమే అభివృద్ధి పనులు బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ప్రపోజల్‌కి పెట్టిన పనులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జోనల్ కమిషనర్ వెంకన్నను కోరారు. ఈ మేరకు జెడ్‌సీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లో రోడ్ల సమస్య అధికంగా ఉందన్నారు. నూతన సీసీ రోడ్లను వెంటనే వేయాలన్నారు. కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు, దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఇదే విషయాలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే పనులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

సావిత్రీబాయికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్: సావిత్రీబాయి పూలే వర్ధంతిని రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో సోమవారం నిర్వహించారు. రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నేతలు కృష్ణమాచారి, సత్యనారాయణ ముదిరాజ యాదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు. బుద్వేల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెండ్యాల శ్రీధర్ తదితరులు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అర్చకులకు గౌరవ వేతనం ఇవ్వాలి

చాంద్రాయణగుట్ట: ఆలయాల్లో కొనసాగుతున్న అర్చకులకు గౌరవ వేతనాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ ఇన్‌చార్జి బోయ నగేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ..చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని చెన్నకేశవ స్వామి ఆలయం, రక్షాపురం శివాలయం, పూల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయం, కందికల్ గేట్ చిత్రగుప్త స్వామి ఆలయాల్లో ఎన్నో ఏళ్లుగా పూజారులు భగవంతుడు, భక్తుడికి అనుసంధానంగా ఉన్నారన్నారన్నారు. వారి సేవలను గుర్తించి వేతనాలు ఇవ్వాలని కోరారు.

మిలియన్ మార్చ్‌లో న్యాయవాదుల పాత్ర కీలకం

యాకుత్‌పురా: తెలంగాణ ఉద్యమంలో నిర్వహించిన మిలియన్ మార్చ్ కార్యక్రమం 14 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పురానిహవేలీలోని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. మిలియన్ మార్చ్‌లో తెలంగాణ న్యాయవాదుల జేఏసీ తరఫున సిటీ సివిల్ కోర్టుకు చెందిన జేఏసీ కో కన్వీనర్లు ఏ.మాణిక్ ప్రభుగౌడ్, ఎం.ఎస్ తిరుమల్ రావు, న్యాయవాదులు ఎం. వెంకటరమణ యాదవ్, పి. శివకుమార్ దాస్ ఉద్యమంలో కీలకమైన పాత్ర వహించారని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు వారి సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి దుబ్బక హర్షవర్ధన్, ఉపాధ్యక్షురాలు ప్రవీణారెడ్డి, సంయుక్తా కార్యదర్శి బర్క రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో 'రన్ ఫర్ యాక్షన్'

గోల్కొండ: లింగ వివక్షను రూపుమాపేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి అన్నారు. షీ టీమ్ ఆధ్వర్యంలో సోమవారం షేక్‌పేట్‌లోని జీఎన్ఐటీఎస్‌లో 'రన్ ఫర్ యాక్షన్–జెండర్ ఈక్వాలిటీ రన్'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళల కోసం ఇంజినీరింగ్ కళాశాల స్థాపించి నేడు ఎందరికో దారి చూపామన్నారు. అసలు మహిళల కోసం ఇంజినీరింగ్ కళాశాలలే అప్పట్లో లేనేలేవని అయితే రాను రాను మహిళల కోసం కళాశాలల సంఖ్య పెరుగుతుందని దీనికి అనుగుణంగా విద్యార్థినుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై ఏమాత్రం వివక్ష చూపకుండా కలిసికట్టుగా ముందుకు సాగేందుకు కృషి చేయాలన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామ్‌చందర్‌రావు



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.రామ్‌చందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కిస్మత్‌పూర్ శ్రీకృష్ణ కాలనీలోని ఎంప్లాయీస్ యూనియన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా రెండవసారి ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎ.రామచంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విట్టలయ్య, కోశాధికారిగా మధుసూదనారావు, సభ్యులుగా ఎ.సత్తయ్యగౌడ్, ఎం.దశరథ్‌ముదిరాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు మాట్లాడుతూ... రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందాయని సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. వీధి దీపాలు, పారిశుద్ధ్యం, ట్యాక్స్ సంబంధిత ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందజేసినట్లు తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును స్వయంగా అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామని సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో విఫలం: బీఆర్‌ఎస్



వినాయక్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నేత సీతారాం ధూళిపాళ

మణికొండ: మణికొండ మున్సిపాలిటీలో పెరిగిపోతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విషయంలో సంబంధిత అధికారులు విఫలం అవుతున్నారని బీఆర్‌ఎస్ మణికొండ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆరోపించారు. గుడ్ మార్నింగ్ మణికొండ మార్నింగ్ వాక్‌లో భాగంగా సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు కుంభగళ్ల ధనరాజ్, బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, సంఘం శ్రీకాంత్, సుమనళిని, భానుచందర్, బొడ్డు శ్రీధర్‌లతో కలిసి పుప్పాలగూడ ప్రాంతంలోని వినాయక్‌నగర్ ఫేస్–2 పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధూళిపాళ మాట్లాడుతూ... మణికొండ పరిధిలో రహదారులు అధ్వానంగా ఉన్నాన్నారు. చెత్తాచెదారంలతో నిండి ఉన్న రహదారులు, దోమల బెడదతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున మురుగు రహదారుపై పొంగిపొర్లుతూ ఆయా ప్రాంతాలను దుర్గంధ భరితంగా మారుస్తునఆయని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో విద్యుత్ కోతల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు ఆయా సమస్యలపై వెంటనే స్పందించి తగు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో బోర్‌వెల్ ఏర్పాటు



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ శంకర్‌రాథోడ్

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో రూ. 2 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. విద్యార్థులకు నీటి సమస్య ఎదురు కాకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బోర్‌వెల్ ఏర్పాటుకు సహకరించిన కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, జీవితారెడ్డి, కొమురయ్య, పాఠశాల పూర్వ విద్యార్థులకు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీలత, పీఆర్‌టీయూ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సాగర్, పాఠశాల ఉపాధ్యాయులు రజియాబేగం, సాయిప్రసాదరావు, రంగారెడ్డి, జ్యోతి, జకీరాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి అధికారితో ప్రజల పరేషాన్!



సెక్షన్ ఆఫీసర్ వద్ద క్యూ కట్టిన ప్రజలు

- ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్‌తో ఇబ్బందులు
- పనుల కోసం కార్యాలయంలో క్యూ కట్టిన ప్రజానీకం

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో సెక్షన్ అధికారిగా ఒకే ఒక్కరు (ఇన్‌చార్జి) పనిచేస్తున్నారు. ఆయన కోసం ప్రజలు రోజూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత వారం సెక్షన్ అధికారి చేతికి ఫ్రాక్చర్ కావడంతో ఆస్పత్రి పాలయ్యారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కోర్టు కేసులు, నోటీసులు, ఫిర్యాదులతో పాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, కొత్తగా ఇళ్లు కట్టుకునేందుకు అనుమతుల కోసం ప్రజలు వేచి చూస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఐదు డివిజన్లు ఉన్నాయి. ఆయా డివిజన్లకు ఐదుగురు సెక్షన్ ఆఫీసర్లు అవసరం ఉంటుంది. అయితే ఒక్క సెక్షన్ అధికారి కూడా అందుబాటులో లేరు. ఫలక్‌నుమా సర్కిల్‌కు చెందిన అధికారిని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన ఒక రోజు ఫలక్‌నుమాలో, మరో రోజు రాజేంద్రనగర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు సదరు అధికారికి రోడ్డు విస్తరణ పనుల అదనపు బాధ్యతలను అప్పగించారు. గత వారం అధికారి కాలు జారి పడటంతో చేతికి ఫ్రాక్చర్ (విరిగింది) అయ్యింది. విశ్రాంతి అనంతరం సోమవారం కార్యాలయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో అధికారిని కలిసేందుకు ప్రజలు క్యూ కట్టారు. అత్యంత ముఖ్య విభాగమైన టౌన్ ప్లానింగ్‌కు ఒక్క పూర్తిస్థాయి అధికారి కూడా లేకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క అధికారిపైనే అది కూడా ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తినే పూర్తిగా పనులు నిర్వహించలేకపోతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరుతున్నారు.

మాజీ ప్రియుడితో వెళ్లిపోయిన నవవధువు!

మణికొండ: వివాహం అయిన ఏడు రోజులకే ఓ నవవధువు మాజీ ప్రియుడితో వెళ్లిపోయిన ఉదంతం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీమందిర్ వద్ద మూడు రోజుల క్రితం జరిగింది. అతని చర్యను తను నివసిస్తున్న బస్తీవాసులే వ్యతిరేకించి, అతని ఫొటోకు చెప్పుల దండ వేసి ఊరేగించిన సంఘటన సోమవారం లంగర్‌హౌస్‌లో కలకలం సృష్టించింది. వివరాలివీ... నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీ మందిర్ వద్ద నివసిస్తున్న ఓ యువతి గతంలో లంగర్‌హౌస్‌లో నివసించే అరవింద్ అనే యువకుడిని ప్రేమించింది. తల్లితండ్రులు ఏడు రోజుల క్రితం ఆమెకు అత్తాపూర్‌కు చెందిన ఓ యువకుడితో వివాహం చేశారు. అయినా మాజీ ప్రియుడితో కొనసాగిన ప్రేమాయణంతో ఆమె అతని వెంట మూడు రోజుల క్రితం వెళ్లిపోయింది. దాంతో తల్లిదండ్రులు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో తమ కూతురు కనిపించటం లేదని ఫిర్యాదు చేశారు. అది విచారణ కొనసాగుతున్న క్రమంలోనే సోమవారం విషయం లంగర్‌హౌస్‌లోని అతని బస్తీలో తెలిసింది. దాంతో స్థానికులు అతను చేసిన చర్యను తీవ్రంగా వ్యతిరేకించారు. బస్తీలో అతని ఫొటోకు చెప్పుల దండ వేసి ఊరేగించారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

15 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు



బీరువాను చూయిస్తున్న హరిత

మణికొండ: తమ స్వస్థలానికి వెళ్లిన వారి ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న 15 తులాల బంగారం చోరీకి గురైన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైరాగిగూడ గ్రామం, సుబ్రమణ్య కాలనీలో సోమవారం వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడకు చెందిన హరిత బైరాగిగూడలో నివసిస్తుంది. ఈ నెల 7వ తేదీన తన స్వస్థలానికి వెళ్లింది. వారి ఇంటికి సమీపంలోనే ఉంటున్న ఆమె సోదరుడు సతీష్ సోమవారం ఇంటి తాళం పగలగొట్టి ఉన్న విషయాన్ని గమనించాడు. వెంటనే తన సోదరికి సమాచారం ఇవ్వటంతో ఆమె తన ఇంటికి చేరుకుంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాతో పాటు ఇంటిలోని సామగ్రిని చిందరవందర చేసి ఉన్న విషయాన్ని గమనించారు. బీరువాలో ఉన్న 15 తులాల బంగారం కనిపించలేదు. దాంతో ఆమె నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

మహ్మద్‌ఒమర్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థికి సోమవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సీఎస్ అండ్ ఐటీ) విభాగం పరిశోధక విద్యార్థి మహ్మద్ ఒమర్ ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో 'బిగ్ డేటా ఎనలిటిక్స్ అండ్ ప్రిడిక్షన్ త్రూ డీప్ లెర్నింగ్ ఫర్ ఎఫిషియెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఈ మేరకు ఆయనకు పీహెచ్‌డీని ప్రకటించారు.

వైభవంగా శ్యామ్‌బాబా శోభాయాత్ర



శ్యామ్ బాబా నిషాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

అత్తాపూర్: అత్తాపూర్‌లో శ్యామ్ బాబా నిషాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. అత్తాపూర్ శ్రీ శ్యామ్ మిత్ర మండల్ ఆధ్వర్యంలో శోభయాత్రను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా వందలాదిగా భక్తులు ఎంతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా బయలుదేరారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. అత్తాపూర్ నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర బహదూర్‌పురా, పురానాపూల్, జుమేరాత్‌బజార్, బేగంబజార్ నుంచి కాచిగూడ శ్యామ్ బాబా ఆలయం వరకు కొనసాగింది. మార్గ మధ్యలో స్వచ్ఛంద సంస్థలు శోభయాత్రకు ఘన స్వాగతం పలికారు. విశ్వవ్యాప్తంగా అందరూ శాంతియుతంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి జీవించాలని ప్రతి సంవత్సరం ఈ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

వర్గీకరణ చేసేదాకా అన్ని ఫలితాలను ఆపాలి: ఎమ్మార్పీఎస్



మణికొండ: ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్–1, 2, 3లతో పాటు అన్ని రకాల ఫలితాలను నిలిపి వేయాలని ఎమ్మార్పీఎస్ గండిపేట మండల ఇన్‌చార్జి పుట్లగారి గణేష్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాని, భానుప్రసాద్ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు నార్సింగి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్‌లో ఉండే మాలల ఒత్తిడికి, పలుకుబడికి తలొగ్గి మాదిగలకు అలాగే ఎస్సీ వర్గీకరణ కోరుకునే దళితులకు తీరని ద్రోహం చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు ముమ్మాటికీ వాస్తవమని స్పష్టం అవుతుందన్నారు. కార్యక్రమంలో మంచిరేవుల గ్రామ అధ్యక్షుడు రజనీకాంత్‌మాదిగ, ఖానాపూర్ గ్రామ అధ్యక్షుడు పెద్దపులి శంకర్‌మాదిగ, నేతలు లింగంపల్లి దేవదాస్‌మాదిగ, రంజిత్‌మాదిగ, నరేష్‌మాదిగ, నరేందర్‌మాదిగ, బాలరామ్, గుండు మల్లప్ప, సాయిమాదిగ, మీట్టు మాదిగ, వెంకటేష్, కృష్ణమాదిగ తదితరులు పాల్గొన్నారు.

బార్కాస్ ఎంకే–11 జట్టు విజయం

గౌలిపురా: బలరాం గోపాల్, మేకల రాజ్ కుమార్ స్మారకార్థం ఈ నెల 7వ తేదీ నుంచి మేకలమండిలోని ఓంకార్ ప్లే గ్రౌండ్ 2వ క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను బార్కాస్‌కు చెందిన ఎంకే–11 టీమ్ గెలుచుకుంది. ఓంకార్ యూత్ అసోసియేషన్, మాతా మాణికేశ్వరి యూత్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 22 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్‌లో బార్కాస్ ఎంకే–11 జట్టు, గౌలిపురా–333 జట్టులు తలపడ్డాయి. ఇందులో బార్కాస్ ఎంకే–11 జట్టు విజేతగా నిలిచి టోర్నమెంట్ కప్‌ను కైవసం చేసుకుంది. బార్కాస్ ఎంకే–11 జట్టుకు అసోసియేషన్ ప్రతినిధులు కప్‌తో పాటు రూ.10 వేల క్యాష్ ప్రైజ్, మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ, యాకుత్‌పురా కంటెస్టెడ్ ఎమ్మెల్యే వీరేంద్రబాబు యాదవ్, నాయకులు ఆదర్శ మహేశ్, కొడి మహేందర్, చర్మాజీ రూప్‌రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, సుమన్ కుమార్ ముదిరాజ్, జి.ఎం.జ్యోతి కుమార్ పాల్గొన్నారు.